# మన్మథుడి నవ్వు

పి. సరళాదేవి

కథానిక

అద్దంముందు నుంచుని, చేతిలో కొబ్బరినూనె పోసుకుని, తలకి రాసుకుందా మనుకున్న నాగరత్నం-వీధిలో బూట్సులచప్పుడు విని పరుగెత్తింది అంతలోకే అతను మెట్లెక్కి మాయమయ్యాడు పరుగెత్తడంలోమాత్రం చేతిలోని నూనె వలికి చీరమీద పడింది చిరాకేసింది నాగరత్నానికి ''బలేవాడే! కనపడలేదుగాని నూనెమాత్రం చీరమీద వలికించాడు'' అనుకుంది

మూడురోజులయింది, మేడమీద గదిలో అతను అద్దెకు దిగి అప్పట్నుంచీ ఎలా వుంటాడో చూద్దామనుకుంటోంది, కాని కనపడితేగా అదేం మనిషో, కనపడినట్టే కనపడి పరుగెత్తుకు వచ్చేసరికి మాయమైపోతాడు

ఆ రోజు నాన్న అమ్మకు చెబుతోంటే వింది- అతను అద్దెకు దిగినట్టుగా ఎవరోలే అనుకుంది ఆ మర్నాడు ఎదురింటి జయలక్ష్మి వచ్చి-''మీ మేడమీద గదిలో దిగినవాడిని చూశావా?'' అంది లేదని తనంటే-''మన్మథుడే అనుకో, అదృష్టవంతురాలివి'' అంది. తనకి కోపం ముక్కుమీద కొచ్చేసింది

మేడమీద దిగినవాడినే మంచి చేసుకుని అక్కయ్యనిచ్చి అల్లుణ్ని చేసుకున్నాడు నాన్న. అలాగే తనకి ఇతను తప్పడని జయ అభిప్రాయం అప్పుడే వుడికిపోతోంది కాబోలు ఉడకనీలే వుడకనీ. ఈవిడగారికింకా పెళ్ళి కాలేదే అని ఆవుడుకంతా తొందరపడి పోతోందే కాని 'వేగన్' అడ్డం వుండగా అప్పుడే ఎలా జరుగుతుంది పాపం, వాళ్ల అక్కయ్యకే ఇంకా కుదరలేదే! అసలు జయ చెప్పబట్టికాని లేకపోతే-తనకు అతణ్ని చూడాలనిపించేదే కాదు.

ఇంతలో మళ్ళా బూట్సుల చప్పుడు వినిపించింది. వస్తున్నాడు కాబోలనుకుని చూస్తోంది. అతను మెట్లలో మలుపు తిరిగాడు, ద్వారంలో నాగరత్నం కనిపించింది. నాగరత్నం అతన్ని చూచి ఊపిరి తీయలేకపోయింది. అతను ఐదునిముషాలు కదలలేక తరువాత సర్దుకుని గబగబాదిగి వెళ్లిపోయాడు. ముందుగా ఆమె పేరు వినివుంటే ఆమె యిలా వుంటుందని అనుకొనివుండేవాడుకాదు. అందుకనే ఐదునిముషాలు అతని కనురెప్పలు డ్యూటీని మరచిపోయాయి.

నాగరత్నం లోపలికివెళ్లి దువ్వెన పట్టుకుని అద్దంముందు కెళ్ళింది విరబోసిన జుత్తు, నూనె కారుతోన్న మొగం, నలిగిపోయిన చీర, జిడ్డోడుతున్న చేతులూ, ఇలాగే అతనికి కనిపించిందికదూ....ఛీ ఛీ. ఏవిటనుకున్నాడో ఏవిటో మూడురోజుల్నుంచీ లేనిముచ్చటంతా ఈ వేషంలోనే తీర్చుకోవాలా? అతనెంత చక్కగా వున్నాడూ!....

''ఎంతసేపే ఆ సింగారం తొందరగావచ్చి, ఈ కూరగాయలు తరిగితే నీ సొమ్మేం పోయిందంట'' అని అమ్మ కేకేసింది

''ఇలా పనులు పురమాయించే మూడు రోజులవరకూ అంత చక్కటి

వాడిని చూడనివ్వకుండా చేశావులే'' అనుకుంటూ త్వరగా జడ ముగించి, వంటింట్లోకి పరుగెత్తింది నాగరత్నం

* * *

ఇదేంమనిషబ్బా! అసలు మనిషేనా అని చూస్తే కళ్ళురిగిపోతాయేమో నన్నట్టు తలెత్తకుండానే నడుస్తాడు లేకపోతే ఆడపిల్లనిచూస్తే బ్రహ్మచర్యం బద్దలయిపోతుం దనుకున్నాడా? ఇంకానయం తలెత్తి చూడకపోతే పోయాడు గాని, వంచుకునే కిందనించి కోరచూపులూ, పక్కచూపులూ చూడడు తరువాత వచ్చేది చూసుకుందామని, కంచుచెంబుతో మొగం మొత్తాలనిపిస్తుంది అయినా అలాంటివాడు కాదులే

మొత్తానికి ఎటునుంచి ఎటుచూసినా చాల మంచివాడు మెత్తనివాడు. ఎవరితోనూ నోరెత్తి గట్టిగా మాటాడి ఎరగడు. స్నేహితులూ వీళ్ళూ వాళ్ళూ వస్తూనేఉంటారు కాని ఇతని మాటలే వినిపించవు ఎంతసేపూ ఆ ఎదుటివాళ్ళ నవ్వులూ కేకలూ వినిపిస్తాయి

చిత్రం! నాన్నగారు తెగమెచ్చేసుకుంటున్నారు. బావనేనా అంత నెత్తిమీద పెట్టుకోలేదు. అక్క ఒప్పుకుందని చేసేరే తప్ప టైము దొరికితేచాలు అతని గదిలోకెళ్ళి కూర్చుంటారు కూర్చున్నంతసేపూ నాన్నగారే నవ్వుతూంటారు అతనికి నవ్వడం కూడా వచ్చునో రాదో! అవునులే,మనిషి మన్మథుడయినప్పుడు- పలుకు బంగారంగా, నవ్వు నవరత్నాలుగా దాచుకోడం మంచిదే! స్టాక్‌చేసి వుంచకపోతే రాబోయే రతీదేవి వూరుకుంటుందా!

ఇలా ఆలోచిస్తూ వీధిలోనికి రాబోతూన్న నాగరత్నం—నాన్నగారూ, అతనూ వస్తూంటే చూసి లోపలికి తుర్రుమన్నది

''వస్తా సీతారాం'' నాన్నగారి చివరిమాట విని 'సీతారాం సీతారాం' అనుకుంది ప్రేమగా

మధ్యాహ్నం చేసిన చేగోడీలు తీసుకెళ్ళి నాన్నగారి కిచ్చింది నాగరత్నం. ఇంకా కొంచెం తీసుకురమ్మన్నారు. తెచ్చిన తరువాత కాగితంలో కట్టి అతనికిచ్చి రమ్మని చెప్పారు తమ్ముడితో చూసింది రత్నం మొత్తంమీద అతనిపట్ల తండ్రి చర్యలన్నీ చూసి అతను తనకే తప్పదనుకుని మురిసిమురిసి, మిడిసిపడింది నాగరత్నం.

అతను తనపక్క చూస్తే, నవ్వితే, మాటాడితే ఎంత బావుంటుందో-అనుకుంటో నాగరత్నం తాగిన మంచినీళ్ళు గొంతులో గరగరనిచ్చాయి.

వీధి కిటికీదగ్గర కూర్చుని అల్లుకుంటోంది మండు వేసవి ఎక్కడినించో చెమటలు కక్కుకుంటూ వచ్చి ''కొంచెం మంచినీళ్ళిస్తారా?'' అన్నాడు. ఎవరా అని చూసింది. తేలిగ్గా నవ్వాడు ఆశ్చర్యాన్ని సిగ్గు కప్పలేకపోయింది అతనే! ఏమిటి? ఇతనేనా అడిగింది! నమ్మలేకపోయింది.

''నీళ్ళిస్తారా?'' అన్నాడు మళ్ళా. లోపలికి వెళ్లి నీళ్లు తెచ్చి ఇచ్చింది అందుకుంటూన్న అతని చేతిని చూసి ఈమె చెయ్యి వణికింది అబ్బ! ఎంతందం! సన్నగా, పొడుగ్గా, నరాలు కదులుతోన్న ఆ వేళ్లూ....తల వంచింది చందనం వంటి పాదాలు! నీళ్ళు తాగుతున్న అతన్ని నిలువుగా చూసింది. మన్మథుడే! శిల్పి చందనంతో చెక్కిన విగ్రహానికి పొరపాటున పరమేశ్వరుడు జీవం పోశాడేమో!

''థాంక్స్'' అంటూ గ్లాసిచ్చాడు అప్రయత్నంగానే ''అబ్బ!'' అనుకుంది ఏవిటా కంఠస్వరం? మనిషిని చూసి అతని కంఠస్వరం ఇలా వుంటుందని ఎవరేనా వూహించగలరా? ఆ దేవతలాంటి సుకుమారానికి, ఈ రాక్షసుడి కంఠమా? ఎంత అన్యాయం! పాపం అందుకేనా అత నెక్కువగా మాట్లాడంది

ఆ మాటలు చెవుల్లో వినిపిస్తున్నాయి. గుండెలో గిలగిల లాడింది.

* * *

రాత్రి అన్నం తింటూ నాన్న అమ్మతో చెబుతున్న మాటలు వింది నాగరత్నం.

"సీతారాం తల్లి చెల్లెళ్లు ఈ మధ్య వస్తారుట. పనిలోపని అప్పుడే సంబంధం ఖాయంచేసేసుకుంటే తీరిపోతుంది. అతన్నడిగాను, మన రత్నాన్ని ఇష్టపడ్డాడు. శాయశక్తులా కట్నం

ఇస్తానన్నాను వాళ్ళుకూడా వస్తే అన్నీ సెటిల్ చేసుకోవచ్చు.''

అది విన్న నాగరత్నానికి అతని రూపుకంటె కంఠస్వరమే ముందు జ్ఞాపకం వచ్చింది అతని అందం కళ్ళను లాగుతోంటే అతని కంఠస్వరం చెవులకు వినిపిస్తోంది, ఏది దారి?

రాజీ మొగుడు నల్ల జనపరాతిలా వుంటాడని తనెంత వెక్కిరించింది. అదే తను ఇతన్ని చేసుకుంటే ఎవరైనా అనగలరూ. ఎన్ని గుండె లుండాలి! పెళ్ళిలో అతని ప్రక్కనుంచుని ఫోటో తీయించుకుంటే....ఎంత బావుంటుందో!

కాని తను స్నేహితులతో మాట్లాడుతున్న పుడు 'రత్నం' అని అతను పిలిస్తే? విలవిల లాడింది

మాటి మాటికి అదే జ్ఞాపకం వస్తోంది మరిచి పోదామని గింజుకుంటోంది

అతన్ని చేసుకోనని చెప్పేద్దామా అను కోడం, అతని రూపం కళ్ల ముందుకు వచ్చి నోరు కట్టుబడి పోవడం ఇలా 'చెప్పేద్దామా? వద్దా?' అని అనుకుంటూనే వుంది అతని తల్లి, ఇద్దరు చెల్లెళ్ళు రానే వచ్చారు

వాళ్ళని చూసి మరీ ఆశ్చర్యపోయింది రత్నం, వీళ్ళకుటుంబమంతా అందగాళ్ళేనని అన్ని అందాల మధ్యకు తాను వెళ్తోందన్న మాట. కంఠస్వరా లెలావుంటాయోనని ఆతృత పడి మాట్లాడింది. కాని మరీ అతని కంఠ మంత మోటుగా వాళ్ళ కంఠస్వరాలు లేవు

మర్నాడు వాళ్ళకి భోజనాలు పెట్టారు అందరూ భోజనం చేస్తూంటే వడ్డించడానికి పూనుకుందేకాని, అతని దగ్గరకు వచ్చేసరికి మాత్రం గడబిడ పడసాగింది. అందులోనూ అతను ఈమెనే చూస్తున్నాడాయే....

వాళ్ళలా భోజనం ముగించి గదిలోకెళ్లారు. నాగరత్నం తమలపాకులూ, వక్కపొడి వెండి పళ్లెంలో పెట్టుకుని తీసుకొస్తూ గది గుమ్మం దగ్గర కొచ్చింది

అంతే! కర్ణకఠోరమైన పెద్దనవ్వు వింది. ఏ సుకుమార హృదయమూ ఓర్వలేని వికటంగా, కర్కశంగావున్న ఆ నవ్వుని భరించ లేక పోయింది ఏ మాట నవ్వు తెప్పించిందో కాని ఒకటే నవ్వులు అందులో అతని రావణాసురుడి నవ్వు!

అతని రూపాన్ని చూసి మురిస్తే మాత్రం ఏమనిషైనా ఎలా భరించగలదు? క్షణక్షణమూ తోడు నీడగా మసలి అతని మాటలు వింటూ, చాల అరుదుగా వెలువడుతూన్నదైనా ఆ నవ్వును ఎలా భరించడం? ఆహ్లాదకరంగా, చెవులకింపుగా, మనోరంజకంగా వెలువడే ఆ నవ్వుయొక్క రూపం ఇలా కూడా వుంటుందా!

చేతిలోంచి పళ్ళెం జారి కిందపడి పోయింది విస్తుబోయి అతని మొగంలోకి కొంతసేపు చూసి, వెంటనే వెనక్కుతిరిగి లోపలికి పరుగెత్తింది వెన్నాడుతూ తరిమింది నవ్వు. బాధతో కిరకిర లాడిపోయింది, అసహ్యంతో కడుపులో పేగులన్నీ ముడుచుకు పోతున్నాయి. ఒళ్ళంతా ముద్దయి పోతోంది. నీరసం వచ్చేసింది గట్టిగా చెవులు మూసుకుంది

పళ్ళెం కిందపడేసి పరుగెత్తుకుని వచ్చేసరికి ఏమిటో అనుకుని వచ్చాడు తండ్రి చెవులు మూసుకుని నిస్త్రాణగా గదిలో గోడకు చేరబడిన నాగరత్నం కనిపించిందతనికి.

''ఏమిటమ్మా? ఏం జరిగింది?'' ఆత్రుతగా దగ్గరకు వచ్చాడు.

''అతన్ని పెళ్ళిచేసుకుని బ్రతకలేను నాన్నా!'' అని బావురుమంది నాగరత్నం— అంతకన్నా తను ఇంకేమీచెప్పలేదన్నట్టుగా. ★

## గమనిక

(క్రిందటి వారం (11-1-57) ''తెలుగు స్వతంత్ర'' పై ముఖచిత్రం పేరు ''సంధ్యా వల్లవి,'' చిత్రకారుడు శ్రీ వెల్లటూరి పూర్ణానంద శర్మ, అనే వివరాలు పొరపాటున వదిలి వేయబడినవి. చిత్రకారునికీ, పాఠకులకూ మా క్షమాపణలు.—సం॥ తె స్వ.)